# ఆటో కార్మికుల సమస్యల పరిష్కారానికి పోరాటం



**అగ్ని ధార న్యూస్ ,(భూపాలపల్లి) :**

ఆటో కార్మికుల సమస్యల పరిష్కారమే లక్ష్యంగా తెలంగాణ నాన్ పొలిటికల్ ఆటో సంయుక్త కార్యాచరణ సమితి నిరంతరం పోరాటాలు చేస్తుందని రాష్ట్ర అధ్యక్షుడు మంద రవికుమార్ అన్నారు. గురువారం జయశంకర్ భూపాలపల్లి జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ చౌక్ వద్ద సింగరేణి ఉద్యోగుల సంఘం కార్యాలయంలో నూతన జిల్లా కమిటీని ఎన్నుకున్నారు.

వావిలాల లక్ష్మణ్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన మంద రవికుమార్ మాట్లాడుతూ రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో ఆటో సంయుక్త కార్యాచరణ సమితి కమిటీలను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ప్రభుత్వం చర్చల పేరుతో కాలయాపన చేయకుండా ఆటో కార్మికులకు ఇచ్చిన హామీలను తక్షణమే అమలు చేయాలని డిమాండ్ చేశారు. అసెంబ్లీలో ఆటో కార్మికుల సంక్షేమ మండలి ఏర్పాటుకు బిల్లు ఆమోదించాలని కోరారు. జిల్లా కన్వీనర్‌గా వావిలాల లక్ష్మణ్, సహ కన్వీనర్‌గా మేడ భాస్కర్‌ను ఎన్నుకున్నారు. లక్ష్మణ్ మాట్లాడుతూ ఈ నెల 15న హైదరాబాద్ ఇందిరాపార్క్‌లో నిర్వహించనున్న ధర్నాకు జిల్లా నుంచి అధిక సంఖ్యలో ఆటో కార్మికులు తరలివచ్చి విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఎన్నికల సమయంలో హామీ ఇచ్చిన రూ.12 వేల ఆర్థిక సాయాన్ని వెంటనే అమలు చేయాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని డిమాండ్ చేశారు. హామీలు అమలు చేయకపోతే ధర్నాకు వేలాదిగా తరలివచ్చి తమ సత్తా చాటుతామని హెచ్చరించారు. జిల్లాలో ఆటో కార్మికుల సమస్యలను గుర్తించి పరిష్కారానికి కృషి చేస్తామని, అన్ని మండలాలు, గ్రామాల్లో కమిటీలను ఏర్పాటు చేస్తామని లక్ష్మణ్ తెలిపారు. కార్యక్రమంలో అంబాల సంపత్, ఏ. మధుకర్, ఎం. మహేష్, పి. రవితేజ, తాళ్లపల్లి సతీష్, బి. సుమన్, బక్కయ్య, గుంటుక పవన్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# రికార్డ్ అసిస్టెంట్ సస్పెండ్.. షోకాజ్ నోటీస్ జారీ...

**విధులకు దీర్ఘకాలంగా గైర్హాజరైన ఉద్యోగిపై చర్యలు...**

**జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష**




**అగ్నిధారన్యూస్ పెద్దపల్లి, సెప్టెంబర్-10:**

కమాన్‌పూర్ మండల తహసీల్దార్ కార్యాలయంలో రికార్డ్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తున్న కె.చిరంజీవి 01.02. 2025 నుండి ఎటువంటి అనుమతి లేకుండా విధులకు గైర్హాజరవుతున్న నేపథ్యంలో, ఆయనపై నిబంధనల ప్రకారం క్రమశిక్షణా చర్యలు చేపట్టినట్లు జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. సంబంధిత ఉద్యోగి దీర్ఘకాలంగా విధులకు గైర్హాజరవుతున్న విషయాన్ని కమాన్ పూర్ మండల తహసీల్దార్ 25.04.2026న నివేదించారని తెలిపారు. అనధికారిక గైర్హాజరుపై వివరణ కోరుతూ జారీ చేసిన మెమోలను స్వీకరించేందుకు కె.చిరంజీవి నిరాకరించడంతో పాటు, ఫోన్ ద్వారా సంప్రదించేందుకు చేసిన ప్రయత్నాలకు కూడా స్పందించలేదని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో సంబంధిత ఉద్యోగిపై తదుపరి అవసరమైన చర్యలు తీసుకోవాలని తహసీల్దార్ నివేదించినట్లు తెలిపారు. తదనంతరం 02.05. 2026న జారీ చేసిన ఉత్తర్వుల ద్వారా కె. చిరంజీవిని సర్వీసు నుండి సస్పెండ్ చేసినట్లు జిల్లా కలెక్టర్ తెలిపారు. తెలంగాణ సివిల్ సర్వీసెస్ (క్లాసిఫికేషన్, కంట్రోల్ అండ్ అప్పీల్) రూల్స్, 1991లోని సంబంధిత నిబంధనల ప్రకారం కె. చిరంజీవిపై సర్వీసు నుండి తొలగింపు శిక్ష విధించేందుకు ప్రతిపాదిం చినట్లు పేర్కొన్నారు. ప్రతిపాదిత శిక్షను ఎందుకు విధించకూడదో, అందుకు గల సరైన, సముచితమైన కారణాలతో కూడిన లిఖితపూర్వక వివరణను షోకాజ్ నోటీసు అందుకున్న తేదీ నుండి 15 రోజుల్లోగా సమర్పించాలని సంబంధిత ఉద్యోగిని కోరినట్లు జిల్లా కలెక్టర్ తెలిపారు. నిర్ణీత గడువులోగా ఎటువంటి వివరణ సమర్పించని పక్షంలో, సంబంధిత ఉద్యోగికి సమర్పించేందుకు ఎటువంటి వివరణ లేదని భావించి, రికార్డులో అందుబాటులో ఉన్న సమాచారాన్ని ఆధారంగా చేసుకుని నిబంధనల ప్రకారం ప్రతిపాదిత శిక్షను విధించేందుకు తదుపరి చర్యలు చేపట్టనున్నట్లు జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష స్పష్టం చేశారు.

# ప్రజా సమస్యలను ప్రశ్నిస్తున్న బీఆర్ఎస్ ఎమ్మెల్యేల సస్పెన్షన్ దారుణం

**అగ్నిధార న్యూస్ గండీడ్:**

అసెంబ్లీ నుంచి బీఆర్ఎస్ ఎమ్మెల్యేలను సస్పెండ్ చేయడాన్ని ఉమ్మడి గండీడ్ మండల బీఆర్ఎస్ నాయకులు తీవ్రంగా ఖండించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 1000 రోజులు పూర్తవుతున్నా ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయకుండా, ప్రధాన ప్రతిపక్షమైన బీఆర్ఎస్ ఎమ్మెల్యేల గొంతు నొక్కే ప్రయత్నం చేస్తోందని ఆరోపించారు. ప్రజా సమస్యలను అసెంబ్లీలో ప్రస్తావిస్తూ ప్రభుత్వాన్ని నిలదీస్తున్న ఎమ్మెల్యేలను మొత్తం సమావేశాల కాలానికి సస్పెండ్ చేయడం ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధమని మాజీ జెడ్పిటిసి ఎం శ్రీనివాస్ రెడ్డి పేర్కొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. 22ఏ భూముల సమస్య, విద్యార్థుల ఫీజు రీయింబర్స్‌మెంట్, పాలిటెక్నిక్ విద్యార్థులకు సంబంధించిన జీవో నంబర్ 97, పదవీ విరమణ చేసిన ఉద్యోగుల ప్రయోజనాలు, నిరుద్యోగులకు హామీ ఇచ్చిన రెండు లక్షల ఉద్యోగాలు, మాజీ సర్పంచుల పెండింగ్ బిల్లులు, ప్రజలకు ఇచ్చిన 420 హామీల అమలు వంటి కీలక అంశాలపై ప్రభుత్వం సమాధానం చెప్పాల్సిన అవసరం ఉందన్నారు. అలాగే వివిధ వర్గాల ప్రజలు తమ సమస్యల పరిష్కారం కోసం అసెంబ్లీ ముట్టడి కార్యక్రమాలు చేపడుతున్న విషయాన్ని కూడా ప్రభుత్వం పరిగణనలోకి తీసుకోవాలని కోరారు. ప్రజల తరఫున ప్రశ్నించే బాధ్యతను బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు అసెంబ్లీలో నిర్వర్తిస్తున్నారని, అలాంటి సభ్యులను సస్పెండ్ చేయడం ద్వారా ప్రజల గొంతును అణచివేయాలని ప్రభుత్వం చూస్తోందని విమర్శించారు. బీఆర్ఎస్ ఎమ్మెల్యేలపై విధించిన సస్పెన్షన్‌ను వెంటనే ఎత్తివేసి, ప్రజా సమస్యలపై అసెంబ్లీలో చర్చకు ప్రభుత్వం అవకాశం కల్పించాలని ఉమ్మడి గండీడ్ మండల బీఆర్ఎస్ పార్టీ నాయకులు డిమాండ్ చేశారు.



## ఐక్యత ఫౌండేషన్ ఆధ్వర్యంలో జర్మనీ టెక్నాలజీ తో త్రాగు నీటి శుద్ధి కేంద్రం



**అగ్ని ధార న్యూస్ (కల్వకుర్తి)**

వెల్దండ మండలంలోని బర్కత్ పల్లి గ్రామంలో నిర్వహించి త్రాగునీటి నిల్వ ట్యాంకులను పరిశుభ్రపరిచి ప్రజలకు అందుబాటులో ఉంచారు. సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి సహకారంతో అందుబాటులోకి తీసుకువచ్చిన జర్మన్ సాంకేతికతతో కూడిన ప్రత్యేక యంత్రాల సహాయంతో గ్రామాల్లోని తాగునీటి నిల్వ ట్యాంకులను శాస్త్రీయ పద్ధతిలో పరిశుభ్రపరుస్తూ, ట్యాంకుల్లో పేరుకుపోయిన మురికి, వ్యర్థాలను తొలగించి గ్రామ పరిశుభ్రతను నెలకొల్పడం ద్వారా తాగునీటి నాణ్యతను మెరుగుపరిచే చర్యలు చేపడుతున్నారు. ఈ సందర్భంగా తాండా ప్రజలు సుంకి రెడ్డి రాఘవేందర్ రెడ్డి కి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో,గ్రామ సర్పంచ్ రాజు,ఉప సర్పంచ్ నరసింహ,ఐక్యత పౌండేషన్ సబ్యులు కొండల్ యాదవ్, యువత నరసింహ, కొండల్,తదితరులు పాల్గొనడం జరిగింది.

## ఉత్తమ ఉపాధ్యాయుడికి ఘన సన్మానం




**అగ్నిధార న్యూస్,(రామగిరి) :**

చందనాపూర్ ప్రాథమిక పాఠశాల అభివృద్ధితో పాటు విద్యార్థుల సంఖ్య పెంపునకు విశేష కృషి చేసిన పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రాచర్ల శ్రీనివాస్కు జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు లభించింది. జిల్లా కలెక్టర్ చేతుల మీదుగా అవార్డు అందుకున్న సందర్భంగా గురువారం ఆయనను గ్రామస్థులు ఘనంగా సన్మానించారు. పాఠశాలలో విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించడంతో పాటు మౌలిక వసతుల అభివృద్ధి, విద్యార్థుల సంఖ్య పెంపు, పాఠశాల ప్రగతికి శ్రీనివాస్ చేసిన కృషిని పలువురు కొనియాడారు. ఉత్తమ ఉపాధ్యాయుడిగా అవార్డు అందుకోవడం చందనాపూర్ గ్రామానికి, పాఠశాలకు గర్వకారణమని పేర్కొన్నారు. ఈ సందర్భంగా చందనాపూర్ గ్రామ సర్పంచ్ కొండ మంజుల శ్రీనివాస్, కాంగ్రెస్ పార్టీ మండల కన్వీనర్ మహేశ్వరరావు, మాజీ ఎంపీటీసీ ఏలువాక ఓదెలు, ఉపాధ్యాయ బృందం, గ్రామస్థులు రాచర్ల శ్రీనివాస్‌ను శాలువాతో సత్కరించి అభినందనలు తెలిపారు. విద్యార్థుల భవిష్యత్తు కోసం మరింత అంకితభావంతో పనిచేయాలని ఆకాంక్షించారు.

## దళితులకు రూ.12 లక్షల హామీ ఏమైంది?

**కాంగ్రెస్ ప్రభుత్వానికి రానున్న రోజుల్లో తగిన బుద్ధి చెబుతాం**

**: దళిత సేన**



**అగ్నిధార న్యూస్,(మంథని) :**

దళితులకు రూ.12 లక్షలు ఇస్తామని హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ఇప్పటివరకు ఒక్క దళితుడికైనా నయాపైసా అందించలేదని రాష్ట్ర దళిత సేన క్రమశిక్షణ కమిటీ అధ్యక్షుడు గద్దల శంకర్, మంథని డివిజన్ అధ్యక్షుడు ఊట్ల శ్రీను విమర్శించారు. కాంగ్రెస్ ఇచ్చిన ఆరు గ్యారంటీలు, 13 డిక్లరేషన్లు, 420 హామీలను అమలు చేయకుండా ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తోందని ఆరోపించారు. గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వం దళితుల అభ్యున్నతి కోసం దళిత బంధు పథకం ద్వారా రూ.10 లక్షల ఆర్థిక సాయం అందించిందని పేర్కొన్నారు. దళితుల ఓట్లతో అధికారంలోకి వచ్చి ఇచ్చిన హామీలను విస్మరిస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వానికి రానున్న రోజుల్లో దళిత సమాజం తగిన బుద్ధి చెబుతుందని హెచ్చరించారు. దళితుల హక్కుల కోసం ప్రభుత్వ వైఖరికి వ్యతిరేకంగా 'చావు డప్పు'తో నిరసన చేపడతామని వారు స్పష్టం చేశారు.

## చాకలి ఐలమ్మ కు నివాళులు అర్పించిన బీఎస్పీ నాయకులు

**అగ్నిధారన్యూస్ గోదావరిఖని సెప్టెంబర్10**



రామగుండం నియోజకవర్గంలో బహుజన్ సమాజ్ పార్టీ నాయకులు మారపెల్లి రవికుమార్ సమక్షంలో గోదావరిఖని లేబర్ కోర్టు వద్ద ఉన్న చాకలి ఐలమ్మ విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. బహుజన్ సమాజ్ పార్టీ నాయకులు, పేగ నరేష్ మాట్లాడుతూ.. చాకలి ఐలమ్మ తెలంగాణ ఉద్యమవీర వనిత తొలి భూపోరాటానికి నాంది పలికిన వీరవనిత చాకలి ఐలమ్మ సామాజిక ఆధునిక పరిణామానికి నాంది పలికిన స్త్రీ శక్తి ధైర్యశాలి తెలంగాణ తిరుగుబాటు సమయంలో ఒక భారతీయ విప్లవ నాయకురాలు విస్నూర్ దేశ్‌ముఖ్‌గా ప్రసిద్ధి చెందిన నిజాం జమీందార్ వ్యతిరేకంగా తన భూమిని సాగు చేసు కోవడానికి ఆమె చేసిన ధిక్కార చర్య , తెలంగాణ ప్రాంతంలోని భూస్వాములకు వ్యతిరేకంగా జరిగిన తిరుగుబాటు సమయంలో చాలా మందికి స్ఫూర్తిగా నిలిచింది. ఆమె విస్నూర్ యొక్క జమీందార్ పోరాటాలకు వ్యతిరేకంగా తిరుగుబాటు చేసిన తెలంగాణ ఉద్యమకారిని కొనియాడారు, కార్యక్రమంలో ధర్మరాజు,మల్లేష్ సది , మహేందర్ తదితరులు పాల్గొన్నారు.

